క్లుప్తంగా

గర్భిణులకు సామూహిక సీమంతం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-2 కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమాన్ని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు గాజులు, జాకెట్లు, పండ్లు, స్వీట్లను సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి మాట్లాడుతూ గర్భిణులకు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్ పల్ల కృష్ణవేణి, తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న కమిషనర్ రత్నంరాజు

పాలకొండ: నగర పంచాయతీ కమిషనర్‌గా ఎస్‌వీజే రత్నంరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన బదిలీపై పాలకొండకు వచ్చారు. ఈ సందర్భంగా రత్నంరాజు మాట్లాడుతూ.. పాలకొండ పట్టణంపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం ఆయన పలువురు అధికారులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

సందర్శన..



వీరఘట్టం ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శిస్తున్న డీజీపీఓ కొండలరావు

వీరఘట్టం: మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని డీజీపీఓ టి.కొండలరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్త సంపద కేంద్రాలను పంచాయతీలకు ఆదాయ వనరులుగా మార్చాలని సూచించారు. జిల్లాలోని పది మేజర్ పంచాయతీ కేంద్రాల్లో ఉన్న సంపద కేంద్రాలను మోడల్ సెంటర్లుగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఈఓపీఆర్‌డీ రమణమూర్తి, ఈఓ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు

సామాజిక దురాఘాతాలను తరిమికొట్టిన ధీశాలి..



వీరేశలింగం పంతులు చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న ప్రిన్స్‌పాల్ తదితరులు

పాలకొండ రూరల్: బాల్యవివాహాలు, వరకట్నంవంటి సామాజిక దురాఘాతాలను, మూఢ నమ్మకాలను తరమికొట్టిన గొప్ప దార్శనికుడు కందుకూరి వీరేశలింగం పంతులు అని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో కందుకూరి జయంతి ఘనంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కందుకూరి బ్రహ్మసమాజం స్థాపించడంతో పాటు మహిళా విద్య కోసం అనేక ఉద్యమాలు చేసిన ధీరుడని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్స్‌పాల్ బి.జయమణి, ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు శంకరరావు, బి.గురవయ్య, తిరుపతిరావు, ఎం.శాంతి, పి.రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

వీరఘట్టం: ప్రభుత్వ బడులను కాపాడుకోవాలని యూటీఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని విక్రమపురంలో బుధవారం ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించి, బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మజ్జి పైడిరాజు, కె.కవిత, కె.గోవిందరావు, బి.దుర్గాప్రసాద్, జేవీ సూర్యప్రకాశ్, కె.సింహాచలం, ఎం.ముకుందరావు, ఎస్.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం వారపు సంత వద్ద విశాఖపట్నం యూనిక్ ఆస్పత్రికి చెందిన వైద్య బృందం బుధవారం మెగా మెడికల్ క్యాంపును నిర్వహించింది. శిబిరంలో రోగులకు వైద్యులు భవాని వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రజలకు వైద్య సేవలందించేందుకు మెడికల్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు.

● పరామర్శ ..



ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి అనంతరం అనారోగ్యంతో మృతి చెందిన మొగదారగూడకు చెందిన సవర మీన కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ పరిస్థితిపై ఆరా తీసి, ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, సర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, నిమ్మక కాంతారావు పాల్గొన్నారు. - సీతంపేట

● ట్రాఫిక్ నివారణపై అవగాహన..



ట్రాఫిక్ నియంత్రణపై స్థానిక పోలీసులు విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎస్సై ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది ఏలాం సెంటర్ వద్ద వాహనాల రాకపోకలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విద్యార్థులతో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయించారు. - పాలకొండ

● అవగాహన ముఖ్యం..



అగ్ని ప్రమాదాలను అవగాహనతో అధిగమించవచ్చని పాలకొండ అగ్నిమాపక శాఖాధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. పట్టణ పరిధిలోని పెద్దకాపు, చిన్నకాపు, కస్పావీధుల కూడలి వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం ప్రత్యేక డెమో నిర్వహించారు. అనంతరం అక్కడి సమీపంలో ఉన్న ధనలక్ష్మి అపార్ట్‌మెంట్ మహిళలకు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. - పాలకొండ రూరల్

చెరువు మట్టితో పోషకాలు వృద్ధి

● రసాయన ఎరువులు తగ్గించేందుకు అవకాశం



ఉద్దవోలు చెరువులో మట్టి నిల్వలు

గరుగుబిల్లి: పంట పొలాల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండటం, వర్షపు నీటిని నిలుపుకొనే సామర్థ్యం తగ్గుతుండటంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. మారిన వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో విపరీతంగా రసాయన ఎరువులు వినియోగించడం కారణంగా భూసారం తగ్గిపోతుంది. అందుకు రైతులు చెరువు మట్టిని విరివిగా వాడుకోవాల్సిన అవసరం వుంది. ప్రస్తుతం చెరువులలో నీరు అడుగంటిపోయి ఉన్నందున ఆయా చెరువులలోని మట్టిని పంట పొలాలలో వేసుకుంటే రసాయన ఎరువులకు పెట్టే వ్యయాన్ని వీలైనంత వరకు తగ్గించుకొనే అవకాశం ఉంటుంది. వర్షాలు పడినప్పుడు వరద నీటితో పోషకాలు కలిగిన సారవంతమైన మట్టి చెరువులోకి చేరుతుంది. వేసవిలో నీరు తక్కువగా ఉండటం వల్ల ఈ మట్టిని పూడిక తీయడం వల్ల వచ్చే ఏడాది చెరువులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. చెరువు నుంచి తీసిన సారవంతమైన మట్టిని, పంట పొలాల్లో వేయడం వల్ల పొలాలు సారవంతమవుతాయి. ఇలా రెండు, మూడేళ్లకొకసారి పొలంలో చెరువు మట్టిని వేయడం వల్ల పొలాలు నీటి కోతకు గురికాకుండా ఉండేందుకు అవకాశం వుంటుంది.

చెరువు మట్టితో ఉపయోగాలెన్నో..

- చెరువు మట్టిని పొలాల్లో వేయడం ద్వారా పొలాన్ని ఆమ్ల, క్షార గుణాలతో తటస్తంగా మార్చుకోవచ్చు.
- చెరువు మట్టి వల్ల నేల గుల్ల బారుతుంది. మురుగునీరు పోయేందుకు అవకాశం ఉంటుంది. నీటిని పొలంలో వుంచుకొనే సామర్థ్యం పెరుగుతుంది.
- సూక్ష్మ, స్థూల పోషకాల స్థాయి పెరుగుతాయి. నత్రజని స్థాయి పెరుగుతుంది.
- మట్టిలోని సేంద్రియ పోషకాలుండటంతో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చు.
- చెరువు మట్టిలో సూక్ష్మజీవులు ఎక్కువగా ఉండటం కారణంగా నేలలో పోషకాలు పెరుగుతాయి.
- వర్షాభావ పరిస్థితులను తట్టుకొనేందుకు అవకాశం ఉంటుంది.
- సేంద్రియ పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మొక్కలు ఆరోగ్యంగా, ఎత్తుగా పెరుగుతాయి.



ఉల్లిబద్ర పంట పొలాల్లో వేసిన చెరువు మట్టి

భూసారాన్ని పెంచుకోవచ్చు



రైతులు రసాయన ఎరువులు వినియోగాన్ని తగ్గించవచ్చు. భూసారాన్ని పెంచుకొనేందుకు చెరువు మట్టిని పంట పొలంలో వేసిన తరువాత కలియదున్నితే ఎంతో మేలు జరుగుతుంది. పంటలకు అవసరమైన అన్ని పోషకాలు లభించి పంటలు ఏపుగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయి.

– ఆర్.విజయభారతి, ఏఓ, గరుగుబిల్లి

సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు



సాలికిరి కాలనీలో రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న కార్మికులు

భామిని: మండలంలోని బాలేరుకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ సొంత ఖర్చుతో సాలికిరి కాలనీ రోడ్డుకు బుధవారం మరమ్మతులు చేయించారు.

ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా బురదగా మారడంతో పిక్క, సిమెంట్ వేసి గుంతలను పూడ్చారు.

బిల్లుల చెల్లింపులో అలసత్వం వీడండి



గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

గుమ్మలక్ష్మీపురం:

గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో అలసత్వం వహించొద్దని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని తన కార్యాలయం వద్ద బుధవారం గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇల్లులేని లబ్ధిదారుల జాబితాను సేకరించాలని, ఇప్పటికే ఇళ్ల మంజూరై.. పనులు చేపడుతున్న లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించి.. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేందుకు ప్రోత్సాహం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ ఎస్.వెంకటరావు, ఏఈలు పాల్గొన్నారు.

రేగిడి హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంను తక్షణమే సస్పెండ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన విద్యార్థి సంఘం, అఖిల భారత యువజన సమాఖ్య, ట్రైబల్ రైట్స్ ఫోరం, ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్, ఆదివాసీ టీచర్స్ అసోషియేషన్, ప్రోగ్రాసివ్ డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గిరిజన విద్యార్థినిని మహిళా ఉపాధ్యాయినిలు లేకుండా ప్రైవేటు క్లినిక్‌లో ఆర్‌ఎంపీతో రహస్యంగా రాత్రివేళ వైద్యం చేయించిన హెచ్‌ఎంపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాల ఎదురుగానే పీహెచ్‌సీ ఉన్నప్పటికీ కురుపాంలో సీహెచ్‌సీ ఉన్నప్పటికీ ప్రైవేటు క్లినిక్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ఇదే విషయమై ఈ నెల 11న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆయా సంఘా నాయకులు పి.రంజిత్‌కుమార్, టి.సాయిబాబు, పి.సురేష్, బి.రవికుమార్, ఎ.చంద్రశేఖర్, పి.భగవాన్, బి.టినాయుడు, ఎం.అమర్నాథ్, ఐ.రామక్రిష్ణ, సోమేష్ తదితరులు పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 21న మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని వెల్లడించారు.

ప్రజామోదంతోనే గ్రామాభివృద్ధి



పెద్దూరు గ్రామసభలో పాల్గొన్న ఉప సర్పంచ్ ఎల్లంనాయుడు తదితరులు

గరుగుబిల్లి: ప్రజలందరి ఆమోదంతోనే గ్రామాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను తయారు చేయడం జరుగుతుందని పెద్దూరు గ్రామ ఉప సర్పంచ్ తెర్లి ఎల్లంనాయుడు అన్నారు. మండలంలోని పెద్దూరు గ్రామ పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి బి.అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఆధారంగా ప్రాధాన్యతా కార్యక్రమంలో గ్రామాభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా, పారిశుధ్యంను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బి.వెంకటదామోదర్, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు. గరుగుబిల్లి, గొట్టివలసలో సర్పంచ్‌లు కె.ఇందుమతి, బి.చంద్రినాయుడు అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

భాసూరులో చోరీ

పాలకొండ రూరల్: మండలంలోని భాసూరు గ్రామంలో చోరీ జరిగింది. ఈ ఘటనపై పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కిమిడి భాస్కరరావు ఈ నెల 11న కుటుంబ సభ్యులతో కలిసి దైవదర్శనార్థం తిరుపతి వెళ్లారు. ఈనెల 15వ తేదీ మంగళవారం స్వగృహానికి చేరుకున్నారు. అప్పటికే అగంతుకులు తాళం వేసి ఉన్న ఇంట్లో ప్రవేశించి బీరువాను చాకచక్యంగా తెరచి అందులో ఉన్న నాలుగు తులాలకు పైబడి బంగారు ఆభరణాలను దొంగిలించుకుపోయారు. బాధిత కుటుంబసభ్యులు విషయం గుర్తించి బుధవారం పోలీసులను ఆశ్రయించారు. తక్షణమే స్పందించిన ఎస్సై కె.ప్రయోగమూర్తి, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా క్లూస్ టీమ్ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫింగర్ ప్రింట్స్ సేకరించారు. దాదాపు ఈతరహా చోరీలు తెలిసిన వారి పనిగానే పోలీసులు పేర్కొంటున్నారు.

గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు

భామిని: మండలంలోని బాలేరు పీహెచ్‌సీలో గర్భిణులకు బుధవారం ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. సీతంపేట ఏరియా ఆస్పత్రికి గైనకాలజిస్ట్ హరీషా ఆధ్వర్యంలో 43 మంది గర్భిణులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వర్మీకంపోస్టుతో సంపద సృష్టి

గరుగుబిల్లి: సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూపీసీ) యూనిట్ల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువులను తయారుచేసి సంపదను సృష్టించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు అన్నారు. మండలంలోని గొట్టివలస పంచాయతీలో వున్న ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్లనుండి వర్మీ కంపోస్టును తయారు చేసి వినియోగంలోకి వచ్చేలా సిబ్బందికి ఆదేశించడం జరిగిందన్నారు. వర్మీకంపోస్టు ఎరువుతో నాణ్యమైన ఆహార ఉత్పత్తులను ఉత్పత్తి చేయాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ ఆస్పత్రి యాజమాన్యం వితరణ



జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎంకు పరికరాలు అందజేస్తున్న కేన్సర్ ఆస్పత్రి ఎం.డి మురళీకృష్ణ

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): విశాఖపట్నంలోని మహాత్మా గాంధీ కేన్సర్ ఆస్పత్రి యాజమాన్యం కురుపాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు వాటర్ కూలర్లు, నాలుగు లైబ్రరీ రాక్స్‌ను వితరణ చేసింది. ఈ మేరకు ఆ ఆస్పత్రి ఎండీ డాక్టర్ వూన్న మురళీకృష్ణ బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావుకు ఆ పాఠశాల వద్ద వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్)లో భాగంగా రూ.2 లక్షల వ్యయంతో వీటిని కొనుగోలు చేసి అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో కూడా ఇదే పాఠశాలకు రూ.లక్ష విలువ చేసే కంప్యూటర్లు, ఇన్వర్టర్లు కూడా వితరణగా అందించినట్లు గుర్తు చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బెహరా దివాకరేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగుకు చర్యలు



మాట్లాడుతున్న జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కొండలరావు

సీతంపేట: గ్రామాల్లో పారిశుధ్య మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ఎక్కడైనా మంచినీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని సూచించారు. పన్నుల వసూళ్ల పకడ్బందీగా నిర్వహించాలన్నారు. స్వర్ణ పంచాయతీ, తదితర అంశాలపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ కె.రాంప్రసాద్, కె.సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

● పాలకొండ మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదారులకు పెండింగ్ బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. గత రెండు, మూడు నెలలుగా చేసిన పనులకు ఇంతవరకు బిల్లులు చెల్లించకపోవడం దారుణమన్నారు. దీంతో వేతనదారులు కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. అలాగే ఉపాధి పనుల వద్ద కనీస వసతులు కల్పించడం లేదన్నారు. మండుటెండలో పనిచేస్తున్నా కనీసం టెంట్ల సదుపాయం కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో పనులు కూడా పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో ప్రజలు వలసబాట పడుతున్నారన్నారు. ఇక్కడ పనుల్లేక కొద్ది రోజుల కిందట వలస వెళ్లిన కిల్లాడకు చెందిన యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడని గుర్తు చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పిస్తే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవన్నారు. నిరుద్యోగ భృతి కూడా ఈ ప్రభుత్వం ఇచ్చిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. ప్రత్యేక డీఎస్సీ ఎండమావిగా మారిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యుడు హరిప్రసాద్, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, తవిటి రాజు, కె.భాస్కరరావు, సొట్టయ్య, ఆనప, మురళి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో ఆదాయం

● డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ సంధ్యారాణి



సమీకృత వ్యవసాయం చేపడుతున్న రైతుతో మాట్లాడుతున్న పీడీ సంధ్యారాణి

వీరఘట్టం: సమీకృత వ్యవసాయంతో రైతుల ఆదాయం పెరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుధారాణి తెలిపారు. మండలంలోని జె.గోపాలపురంలో అర్జునరావు అనే రైతు చేపడుతున్న సమీకృత వ్యవసాయాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఆయనకు ఉన్న కొద్దిపాటి స్థలంలో ప్రకృతి వ్యవసాయంతో పాటు నాటుకోళ్లు, కుందేళ్లు, కాయగూరల పెంపకం ద్వారా వస్తున్న ఆదాయ వనరులను అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా సాగు చేపడితే మంచి ఆదాయం వస్తుందని పీడీ అన్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే మరింత మెరుగైన వ్యవసాయం చేస్తానని రైతు తెలిపాడు. పరిశీలనలో ఆమెతో పాటు ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.లలితకుమారి, ఏపీఎం కె.రాము, సీసీ ఆనందరావు, తదితరులున్నారు.

● దళిత వీధిలో దాహం కేకలు



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కొమరాడ: కొమరాడ దళిత వీధిలో గత పదిహేను రోజులగా మోటారు పోయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని దళిత మహిళలు అంతా కలసి సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తితో బుధవారం నీటి కుళాయి వద్ద ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచినీరు లేక నాగావళి నది వద్దకు వెళ్లి బురద నీరు తీసుకుని తాగుతున్నామని దీంతో జర్వాలు వస్తున్నాయన్నారు. అధికారులు మోటారు బాగు చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఖైదీల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

● న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



సబ్‌జైల్‌లో రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న సన్యాసినాయుడు

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల భద్రతపై జైల్ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్. సన్యాసినాయుడు అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేవారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ.. వారికి అందుతున్న న్యాయ సేవలపై ఆరా తీశారు. అనంతరం రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, పరిసరాల నిర్వహణ, తదితర అంశాలపై జైల్ సూపరింటెండెంట్ బి.జోగులును అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట జిల్లా ప్రొగ్రామింగ్ అధికారి జి.ఆదిలింగం, న్యాయసేవాధికార సంస్థ పాలకొండ అధ్యక్షుడు, న్యాయమూర్తి ఎ.విజయ్ రాజ్‌కుమార్, తదితరులున్నారు.